ప్రజాకలం పాఠకులకు, ప్రకటనదారులకు, అధికారులకు రాజకీయనాయకులకు, కార్యకర్తలకు సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
రంజాన్ శుభాకాంక్షలు
- ప్రజాకలం టీం

RNI NO.TELTEL/2010/33275
ఎడిటర్- కలకొండ రామకృష్ణ
# ప్రజా కలం
తెలుగు దినపత్రిక
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com, www.magzter.com

సోమవారం | 31-03- 2025 — DIGITAL EDITION — రంజాన్ ప్రత్యేకం

# నేడే ఈద్ ఉల్ ఫితర్

- ముగిసిన రంజాన్ ఉపవాసాలు
- దానధర్మాల పండుగకు సిద్ధమైన ముస్లింలు
- ప్రార్థనల కోసం ఈద్గాలు, మసీదులు ముస్తాబు

ప్రజా కలం ప్రత్యేకం..



**మెట్ పల్లి ప్రతినిధి, మార్చి 31 (ప్రజాకలం) (రిపోర్టర్: మహ్మద్ అజీమ్):**

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్న ముస్లింలు, దాన ధర్మాల పండుగలా భావించే 'ఈద్-ఉల్-ఫితర్'ను నేడు మెట్ పల్లి డివిజన్ వ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు. సామరస్య భావాలకు, సమున్నత జీవన విధానానికి ప్రతీకగా, పరస్పర ప్రేమ, శాంతి, సహనాన్ని ప్రబోధించిన రోజుగా భావించే ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు మెట్ పల్లిలో ఈద్గాలను ముస్తాబు చేశారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు విరమించి ఈద్-ఉల్-ఫితర్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. 'ఈద్-ఉల్-ఫితర్'ను దానధర్మాల పండుగగా భావిస్తారు. నిరుపేదలకు విస్మరించకూడదనే తాఖీదును అనుసరించి ప్రతి ముస్లిం తనకు తోచిన మేరకు ఫిత్రా(దానం) ఇస్తారు. పేద, ధనిక వ్యత్యాసం లేకుండా కుటుంబ సభ్యులందరి తరఫున ఫిత్రా చెల్లించాలనే వారి ఫర్జ్(నియమం). రంజాన్ చివరి ఉపవాసం రోజు నెలవంక చూశాక ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు ఫిత్రా చెల్లిస్తారు. నిరుపేదలు సైతం పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలనేది సారాంశం అందులో ఉంది. పండుగ రోజున ముస్లింలు ఉదయమే స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈద్గాల్లో ప్రార్థనల అనంతరం మత పెద్దల సందేశాలను శ్రద్ధగా వింటారు. ఆలింగనాలు చేసుకుని పరస్పర శుభకాంక్షాలు (ఈద్‌ముబారక్) తెలుపుకుంటారు.

పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తాయని తెలిసిందే. అన్ని మతాల పండుగల వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. మానావాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ లేదా ఈద్-ఉల్-ఫితర్ విశిష్టత ఇదే.. ముస్లింలు చాంద్రమాన కేలండర్ ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల 'రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం 'దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజు. ఈద్-ఉల్-ఫితర్ అనేది ప్రపంచవ్యాప్తంగా ముస్లిములు జరుపుకునే ముఖ్యమైన పండుగ. ముస్లింలు ఉపవాసం ఉండడానికి వీల్లేని షవ్వల్ మాసంలో మొదటి రోజు, అంతేకాక ఏకైక రోజు కూడా. ఈద్ షవ్వల్ మాసం తొలిరోజు అవుతుంది. చాంద్రమాన హిజ్రీ నెల తేదీలు స్థానికంగా చంద్రోదయంపై ఆధారపడివుండడంతో స్థానిక మతాధిపతులు నెలవంక కనిపించడంపై ఈ పండుగను ప్రకటిస్తారు. దాంతో ఈద్-ఉల్-ఫితర్ ప్రాంతాలవారీగా వేర్వేరు రోజుల్లో జరుపుకుంటూం టారు. మన దేశంలో ఈద్-ఉల్-ఫితర్ నేడు జరుపుకొంటున్నారు. ఈద్-ఉల్-ఫితర్ నాడు రెండు రకాహ్‌లు అనే విభాగాలతో కూడిన ఒక ప్రత్యేకమైన సలాత్ (ఇస్లామీయ ప్రార్థన) చేస్తారు. సాధారణంగా బహిరంగ స్థలంలో కానీ, భారీ హాలులో కానీ ఈ ప్రార్థన చేస్తారు. ఈ ప్రార్థనను కేవలం సమూహంగానే (జమాత్) చేస్తారు. రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో 'జకాత్ ' అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని 'జకాత్' అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాలను ఏవైనా నిరుపేదలకు దానంగా ఇస్తారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకు నేందుకు ఈ ' జకాత్ ' ఉపయోగపడుతుంది. 'జకాత్' తో పాటు ' ఫిత్రా' దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడుపూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తూవుంది. దీనినే 'ఫిత్రాదానం' అని పిలుస్తారు. ఉపవాసవ్రతాలు విజయవంతంగా ముగిసినందులకు దేవుడి పట్ల కృతజ్ఞతగా.. పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారు. ఫిత్రా దానంలో 250 గ్రాముల తక్కువ రెండు కిలోల గోధుమలను గానీ, 3.5 కేజీల డేట్స్, 1.75 కేజీల బార్లీ, 3.5 కేజీల రైసిన్‌లను, ఇతర ఆహారధాన్యాలను గానీ, దానికి సమానమైన ధనాన్ని గానీ పంచిపెట్టాలి. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేయాలి. దీనివలన సర్వపాపాలు హరించబడి, పుణ్యం దక్కుతుందనే నమ్మకం ఉంది. దైవ ప్రవక్త ఫిత్రాధానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం - ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు తలంపులు, ఆలోచనలు, నోటినుంచి వెలువడే అసత్యాలు, పనికిమాలిన మాటలు వంటి పొరపాట్లు జరుగుతూ వుంటాయి. ఇలాంటి అనాలోచిత పొరపాట్లు అన్నీ ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయి ' అని మహమ్మద్? అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ తెలిపారు. మానవుల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించి చిరుజీవితాన్ని ఆనందంతో నింపి పుణ్యకార్యాల వైపు దృష్టి మరల్చే రంజాన్ మాసం చైతన్యాన్ని కలిగించి ముందుకు సాగే ధైర్యాన్నిస్తుంది. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రవత్తులతో జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి పండుగ నమాజును ఊరిబయట నిర్ణీత ప్రదేశాలైన ఈద్‌గాహ్ లలో చేస్తారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ (శుభాకాంక్షలు) చెప్పుకుంటారు.

> పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తాయని తెలిసిందే. అన్ని మతాల పండుగల వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. మానావాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ లేదా ఈద్-ఉల్-ఫితర్ విశిష్టత ఇదే.. ముస్లింలు చాంద్రమాన కేలండర్ ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల 'రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం 'దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే.






జామా మసీద్




## మెట్ పల్లిలో ముస్తాబైన ఈద్గాలు, మసీదులు

రంజాన్ పర్వదినం సందర్భంగా మెట్ పల్లిలో ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. పట్టణంలోని అన్ని ప్రధాన మసీదులతో పాటు పట్టణ శివారులోని వెంకట్రావుపేట వద్ద గల ఈద్గాను ముస్తాబు చేశారు. ఈద్గా వద్ద ముస్లిం మైనార్టీ సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం ఒకరినొకరు అలైబలై చెప్పుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అనంతరం ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సామూహిక భోజనాలు నిర్వహిస్తారు.

## నెల రోజుల భక్తి.. ఏడాదంతా స్ఫూర్తి

**అత్యంత నియమ నిష్టలతో పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు చేపట్టి షవ్వాల్ నెలవంక చూసిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటాం. పేదల ఆకలి బాధలు తెలుసుకొని ఈద్ నమాజ్ కు ముందే ప్రతి ఒక్కరు విధిగా ఫిత్రా, జకాత్ చెల్లించాలి. ఇదే పవిత్ర రంజాన్ మాసం ఆశయం. ప్రేమ, కరుణ, సోదరభావం, పరమత సహనం ఇస్లాం ముఖ్య ఉద్దేశం. రంజాన్ మాసమంత అనుక్షణం సర్వ మానవాళి సుఖ సంతోషాల కోసమే ప్రార్థిస్తాం. ఈ నెలలో నియమ నిష్టాలతో చేసిన ప్రార్థనలు తప్పకుండా నెరవేరుతుంది. ఇస్లాం మూల సిద్ధాంతాలు కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ ఐదు అంశాలపై ఉన్నాయి. రంజాన్ నెలంతా శిక్షణ కాలం వంటిది. ఈ నెలలో దైవ ప్రార్థన, బీదలకు తనవంతు సాయం, ఇరుగుపొరుగు వారిని ప్రేమిస్తూ గడిపిన జీవన విధానం మిగిలిన 11 నెలలు పాటు ఆచరించాలని పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ నిర్దేశించారు. అల్లాహ్ సూచించిన సన్మార్గంలో ముస్లింలందరు నడవాలి.**



ముఫ్తి మొయిజ్ షాంజి, మత గురువు. మెట్ పల్లి.



మహమ్మద్ అజీమ్
ప్రజా కలం
ఉమ్మడి కరీంనగర్ ఇంఛార్జీ